క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

శామీర్‌పేట్: అలియాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని అలియాబాద్ ఏఈ ఓ పత్రిక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగ్గంగూడ, నిక్మార్ తదదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఘట్‌కేసర్: పట్టణంలోని ఈడబ్ల్యూఎస్ కాలనీలో సోమవారం మృతి చెందిన కుంభం సత్యనారాయణ కుటుంబసభ్యులను మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలను మృతుడి కుమారుడు శ్రీనివాస్‌కు అందజేశారు. సిరాజ్, నవీన్, ప్రసాద్‌ముదిరాజ్, శ్రీధర్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబర్–395లో అక్రమంగా నిర్మించిన ఇంటిని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో సిబ్బందితో కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలను సద్వినియోగం చేసుకోండి

కీసర: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి పంట రుణాలు ఇస్తామని పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఈ మేరకు తన కార్యాలయంలో మాట్లాడుతూ ఆసక్తి గల రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోండి

కీసర: కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మాధవీలత అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ 18–59 ఏళ్లలోపు వయస్సు ఉన్న రైతులు రైతు బీమా పథకానికి అర్హులన్నారు. ఆసక్తి గల రైతులు దరఖాస్తు ఫారం, పట్టాదారు పాస్ బుక్, రైతు ఆధార్ కార్డు కాపీ, నామినీ ఆధార్ కార్డు కాపీ తీసుకొని కీసర మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతు స్వయంగా వచ్చి బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

రోడ్డు పనులు ప్రారంభం



మేడ్చల్: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను కౌన్సిలర్ సాటే మాధవి నరేందర్ ప్రారంభించారు. కాలనీలో బాలికల వసతి గృహం నుంచి ఏటీఎం వరకు దాదాపు రూ.18 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం నిర్మాణ పనులను పరిశీలించారు. కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

బోడుప్పల్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హెచ్‌పీసీఎల్ చర్లపల్లి ఎల్‌పీజీ సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడా పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. పచ్చదనం, పరిశుభ్రతతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో భాగంగా చిత్రలేఖనం, వ్యక్తిత్వ పోటీలను నిర్వహించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఉదయ కృష్ణ, పాఠశాల డైరెక్టర్ అనిల్ అయ్యంగార్, ప్రిన్సిపాల్ నీలిమా, విద్యార్థులు పాల్గొన్నారు.



చీర్యాల గ్రామంలో ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ తదితరులు



దమ్మాయిగూడలో అమ్మవారి ఫలహార బండి ఊరేగింపులో పోతరాజు విన్యాసం



దమ్మాయిగూడ మున్సిపాలిటీలో ఫలహార బండ్ల ఊరేగింపులో మంత్రి మల్లారెడ్డి

ఘనంగా ఫలహార బండ్ల ఊరేగింపు

బోనాల ఉత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో నిర్వహించిన అమ్మవారి ఫలహార బండ్ల ఊరేగింపు కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. దమ్మాయిగూడ, అహ్మద్‌గూడల్లో వివిధ సంఘాల నేతలు, యువజన సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవార్ల ఫలహార బండ్ల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. చీర్యాలలో ఫలహార బండి ఊరేగింపులో ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు ప్రణీతాగౌడ్, కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్లు బండారి మల్లేష్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు. – కీసర

ఖాళీ ప్లాట్లతో పాట్లు..

- పెద్దఎత్తున పేరుకుపోతున్న చెత్తాచెదారం
- దోమలు, పందులకు ఆవాసాలుగా..
- అపరిశుభ్రతతో అనారోగ్య సమస్యలు
- పట్టణాలు, గ్రామాల్లో రోగాలబారిన ప్రజలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారు పురపాలికలు, గ్రామ పంచాయతీల్లోని ఖాళీ ప్లాట్లతో తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. అందులో చెత్తా, చెదారం, మురుగు నిలిచిపోయి దోమలు విజృంభిస్తున్నాయి. అపరిశుభ్రత కారణంగా పందులు స్వైర విహారం చేస్తున్నాయి. భవిష్యత్ అవసరాలకు స్థలాలు కొనుగోలు చేసిన వారు నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా ఉంచడంతో ఈ సమస్య నెలకొంది. పురపాలిక చట్టం ప్రకారం ఖాళీ స్థలాల్లో ఎలాంటి ముళ్ల పొదలు పెరగకుండా, అపరిశుభ్రత లేకుండా చూసుకోవాలి. లేదంటే పుర అధికారులు స్థలం యజమానికి నోటీసులు ఇచ్చి శుభ్రం చేయించాలి. కానీ.. గ్రేటర్ శివారులోని మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని జీహెచ్ఎంసీ సర్కిళ్లతో సహా 29 పురపాలికల్లోని పలు కాలనీల్లో ఖాళీ ప్లాట్లు అపరిశుభ్రతకు నిలయంగా మారుతున్నాయి. సెమీ అర్బన్ ప్రాంతాలుగా మనుగడ సాగిస్తున్న గ్రామ పంచాయతీల్లో కూడా అదే పరిస్థితి నెలకొంది. వర్షాకాలం కావడంతో నీరు నిల్వ ఉండి దోమల స్వైరవిహారంతో జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పర్యవేక్షణ లేక..

స్థల యజమానులు తమ ప్లాట్లలో మురుగు, వర్షం నీరు నిలవకుండా, పిచ్చి మొక్కలు పెరగకుండా, ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలి. అధికారులూ దీన్ని పర్యవేక్షించాలి. కానీ కొందరు ప్లాట్లను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకొని వదిలేస్తున్నారు. ఆ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి.. చెత్తాచెదారం పేరుకుపోయి, డ్రైనేజీ నీరు చేరడంతో కొన్ని ఖాళీ ప్లాట్లు మురుగు కూపాలుగా మారుతున్నాయి. సంబంధిత యజమానులకు అధికారులు అడపాదడపా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. కొందరి వివరాలు తెలియక నోటీసులు ఇవ్వడం లేదు. వాస్తవంగా స్థలం మార్కెట్ విలువలో 0.5 శాతం ఖాళీ స్థలం పన్ను(వీఎల్‌టీ) చెల్లించాల్సి ఉంటుంది. అదీ వసూలు కావడం లేదు. అసలు పురపాలికల పరిధిలో ఎన్ని ఖాళీ స్థలాలు ఉన్నాయో కూడా సిబ్బంది దగ్గర పూర్తి వివరాలు లేవని తెలుస్తోంది.

ఖాళీ ప్లాట్లను గుర్తించి.. చర్యలు తీసుకుంటాం..

పురపాలిక పరిధిలో ఖాళీ ప్లాట్లు ఎన్ని ఉన్నాయో గుర్తిస్తాం. వాటిలో చెత్త వేయకుండా, మురుగు, వర్షం నీరు చేరకుండా.. పిచ్చి మొక్కలు తొలగించుకునేలా సంబంధిత యజమానులకు సంబంధిత కమిషనర్లు నోటీసులు జారీ చేసేలా ఆదేశాలిచ్చాం. సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపడతాం. స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి, వారి నుంచి ఖాళీ స్థలాల పన్ను వసూలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా.

ఘనంగా కలశయాత్ర

మేడ్చల్‌లో ఉత్తర భారతీయుల ర్యాలీ



మేడ్చల్: ఉత్తర భారతీయుల ఆధ్వర్యంలో ఆషాఢ, శ్రావణ మాసంలో నిర్వహించే శ్రీమత్ భగవత్ కలశ యాత్రను మేడ్చల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కేఎల్ఆర్ వెంచర్ శివాలయం నుంచి శ్రీనివాస్ కల్యాణ మండపం వరకు మహిళలు కలశాలతో ర్యాలీ నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికంగా నివసిస్తున్న ఉత్తర భారతీయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వేడుకలు 24వ తేదీ వరకు వరకు కొనసాగుతాయని తెలిపారు.

ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం



బాబాగూడలో పర్యటిస్తున్న మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట్: ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం శామీర్‌పేట మండలంలోని బాబాగూడ, బొమ్మరాశిపేట, పొన్నాల్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న దేవాలయాలు, కాలనీల్లో రోడ్డులేని చోట తన సొంత నిధులతో పూర్తి చేస్తానని తెలిపారు. అనంతరం స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. రోడ్డు నిర్మాణ పనులు రేపటి నుంచే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, ఎంపీపీ యెల్లుబాయి, మండల అధ్యక్షుడు సుదర్శన్, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రైల్వే వంతెన నిర్మాణమే అఖిలపక్ష లక్ష్యం



ఘట్‌కేసర్‌లో రైల్వే వంతెన కార్యాచరణపై చర్చిస్తున్న అఖిలపక్ష నాయకులు

ఘట్‌కేసర్: పట్టణంలోని రైల్వే గేటు సమీపంలో వంతెన నిర్మాణం, భూనిర్వాసితులకు న్యాయమైన పరిహారంపై సోమవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ పెండింగ్ పనులన్నీ చేయించే సత్తా తనకే ఉందన్న మంత్రి మల్లారెడ్డి పదేళ్లుగా అధికారంలో ఉన్నట్లు మరిచిపోతున్నాడని ఎద్దేవా చేశారు. గతంలో ఎంపీగా ఐదేళ్లు, ప్రస్తుతం మంత్రిగా ఉన్న మల్లారెడ్డి వంతెన పనులు ఎందుకు పూర్తి చేయించడం లేదని ప్రశ్నించారు. రైల్వే వంతెన నిర్మాణమే అఖిలపక్ష లక్ష్యమని, ఈ నెల 21న టెండర్ తెరవని పక్షంలో అఖిలపక్ష కార్యాచరణ ప్రారంభిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, నాయకుడు ముత్యాలుయాదవ్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్, టీజేఎస్ నాయకుడు లక్ష్మారెడ్డి, సీపీఎం నాయకులు యాదయ్య, సబిత, ఏఐటీయూసీ నాయకుడు జయచంద్ర, ఈడబ్ల్యూఎస్ కాలనీ అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి శశిధరన్, పొన్నయ్య, నాగభూషణం, రాధాకృష్ణ ముదిరాజ్, గోపాల్, ఖయూమ్, వెంకటేశ్, కుమార్, శ్రీనివాస్, రాంచందర్, సంతోశ్‌గౌడ్, సుధాకర్, రాంమోహన్ పాల్గొన్నారు.

నానావత్ పద్మకు నివాళి



నివాళులర్పిస్తున్న మహేశ్‌గౌడ్, గోపాల్‌రెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: ఘనాపూర్ గ్రామంలో ఆ గ్రామ దివంగత సర్పంచ్ నానావత్ పద్మ తృతీయ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచులు రూప్‌సింగ్‌నాయక్, మమతగౌడ్, మాజీ ఉప సర్పంచ్ సత్తయ్యగౌడ్, వార్డు సభ్యుడు భాస్కర్, రాజుగౌడ్, నర్సింహ, సురేశ్‌నాయక్, లతరెడ్డి, శివాజీనాయక్, హనుమంతు, జంగారెడ్డి, మల్లేశ్‌గౌడ్, శ్రీనివాస్, అభిలాష్, డి.శివగౌడ్, వి.శివగౌడ్ పాల్గొన్నారు.

కీసరగుట్టలో స్వామివారికి పూజలు





కీసర: కీసరగుట్ట శ్రీభవానీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం అమావాస్య(ఆషాఢమాసం) సందర్భంగా గర్భాలయంలో కొలువైన స్వామివారికి వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం, క్షీరాభిషేకం, గంధాభిషేకం, భస్మాభిషేకం తదితర పూజలను వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ, ఈఓ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను స్వచ్ఛ ఆటోకే అందించాలి

- రోడ్లపై.. చౌరస్తాల్లో చెత్త వేస్తే జరిమానా విధిస్తాం
- జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ అరుణ కుమారి

రామంతాపూర్: ఉప్పల్ సర్కిల్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ అరుణ కుమారి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అధికారి చందనతో కలిసి సోమవారం రామంతాపూర్ డీమార్ట్ ఇందిరానగర్ వద్ద గల గార్బేజ్ పాయింట్ వద్ద పారిశుద్ధ్య పర్యవేక్షణలో భాగంగా తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా కొంతమంది తమ ఇంటిలోని చెత్తను జీహెచ్ఎంసీ ఆటో వారికి అందించకుండా ఎక్కడ పడితే అక్కడ వేసేందుకు వచ్చిన వారిని వివరాలు అడిగి ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా డీసీ అరుణకుమారి మాట్లాడుతూ తమ ఇంట్లోని చెత్తను స్వచ్ఛ ఆటోలో వేయాలని సూచించారు. వ్యాపారస్తులు కానీ ఇంటి యజమానులు కానీ ఎవరైనా చెత్త ఎక్కడ పడితే అక్కడ వేస్తే భారీ జరిమానాలు విధించడమే కాకుండా వారి వ్యాపార లైసెన్సులు రద్దు చేస్తామని ఆమె హెచ్చరించారు.



కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి అంతర్జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి

బోడుప్పల్: లండన్‌లోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో వారం రోజుల పాటు జరిగిన వివిధ వర్క్‌షాపుల కాన్ఫరెన్స్‌లో బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి అంతర్జాతీయ అవార్డు అందజేశారు. బోడుప్పల్‌లో ఆయన మాట్లాడుతూ కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ గైడోజ్, డాక్టర్ ఫెర్నాండేజ్, ఎస్ఐఎస్ఏ ప్రెసిడెంట్ డాక్టర్ కూల్ భూషణశర్మ చేతుల మీదగా బెస్ట్ స్కూల్ ఇన్నోవేషన్ అండర్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అంతర్జాతీయ అవార్డు అందుకున్నట్లు వెల్లడించారు. ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్ పద్ధతి, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ, ప్రతి విద్యార్థిలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం, గ్రూప్ డిస్కషన్ డిబేట్ ప్రామాణికంగా ఈ అవార్డు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందని, విద్యార్థులకు మరింత మెరుగైన విద్య అందించాలనే లక్ష్యంతో ఉన్నట్లు వెల్లడించారు.

కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం



ఘట్‌కేసర్‌లో సంఘీభావం తెలుపుతున్న కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బాలపీరు

ఘట్‌కేసర్: పారిశుద్ధ్య కార్మికులు సమ్మె విరమించేలా తక్షణమే జేఏసీ నాయకులను చర్చలకు పిలిచి సమ్మెను విరమింపజేయాలని కులవివక్ష పోరాట సమితి జిల్లా కార్యదర్శి బాలపీరు డిమాండ్ చేశారు. స్థానిక స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెకు ఆయన సోమవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు, మోటారు ఆపరేటర్లు, కారోబార్లు, ఎలక్ట్రిషియన్లు తొమ్మిది రోజులుగా సమ్మెలో ఉంటే ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. కేవీపీఎస్ జిల్లా సభ్యులు మధు, మహేశ్వరీ, సీఐటీయూ మండల కార్యదర్శి సబిత, సీపీఎం జిల్లా సభ్యుడు యాదయ్య, కార్మికులు శివ, బాలరాజు, శ్రీను, బాబు, ముత్యాలమ్మ, భారతమ్మ, లక్ష్మమ్మ, మైసయ్య, జంగయ్య, దాసు, ప్రవీణ్, దానయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్

ఘట్‌కేసర్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత సాధన ఉద్యమం అంతిమ దశకు చేరుకున్న సందర్భంగా జాతిని గెలిపించడమే ప్రతి మాదిగ బిడ్డ ఏకైక లక్ష్యమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్ అన్నారు. పట్టణంలో సోమవారం జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సామాజిక న్యాయానికి అద్దం పడుతుందన్నారు. వర్షాకాల సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల 21న ఘట్‌కేసర్‌లో జరగనున్న జిల్లా సదస్సుకు జిల్లా నలుమూలల నుంచి మాదిగ కార్యకర్తలు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు చిరంజీవి, రాష్ట్ర నేత నాగేశ్, నాయకులు శ్రీనివాస్, నరేందర్, శివ, రవి, సాయి, అక్బర్, దాసు, రాకేశ్, శేఖర్, రాబర్ట్ పాల్గొన్నారు.



శ్రీవైష్ణవ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక

బోడుప్పల్: బోడుప్పల్ శ్రీ వైష్ణవ సేవా సంఘం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వంగీపురం అమర్నాథ్, ప్రధాన కార్యదర్శిగా కందాల రాఘవేందర్, ఉపాధ్యక్షుడిగా శృంగారం చక్రవర్తి, కోశాధికారులుగా మోర్గడి రాఘవాచార్యులు, పీఎల్ఎన్‌చారి, సహాయ కార్యదర్శులుగా వేదాంతం శ్రీనివాస్, రాఘవాచార్యులు, కలకోట కృష్ణమోహన్, చిలకమర్రి అరవింద్, పీఆర్‌ఓగా ఎం.ప్రవీణ్‌కుమార్, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల ఇన్‌చార్జి వంగీపురం శశాంక్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కాటూరి రఘు, కందాల వంశీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉప్పల్ కాళభైరవ స్వామి ఆలయంలో పూజలు

ఉప్పల్: ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో సోమవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బండారి లక్ష్మారెడ్డి స్థానిక నాయకులతో కలిసి కాళ భైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ యువత భక్తిశ్రద్ధలు పెంపొందించుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత నెలకొంటుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయ ఢంకా మోగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.